


ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 12 పుష్పం : 24-25 5-3-2004

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 12

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు
## ఫిబ్రవరి 21 నుండి 25, అరుణాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

చైతన్యంలో జ్ఞానంఅజ్ఞానం అని, మంచిచెడుఅని, పుణ్యం పాపం అని ఏమీలేవు, ఇవిఅన్నీ మనస్సు యొక్క పరిధిలోనివి. గాఢనిద్రలో దేహము గొడవలేదు, కష్టసుఖాల గొడవలేదు, స్నేహితులు లేరు, విరోధులు లేరు, కర్మలేదు, కర్మఫలితం ఇచ్చేవాడు లేడు. జాగ్రదవస్థలో మనస్సు వచ్చాక ఇవిఅన్నీ వస్తున్నాయి. ఇక్కడ ఏమీలేదు, అక్కడ ఏదోఉంది అని అనుకొంటాము. ఇలా అనుకొన్నంతకాలం ప్రయాణాలు మనకు తప్పవు. ఇలా అనుకోవటంలోనే అజ్ఞానం అంతాఉంది, అది వదిలేస్తే ఏమీలేదు. మనం కొంతమందిని మంచివారు అని, కొంతమందిని చెడ్డవారు అని అంటాము. మన మనస్సులో అనుకొన్నట్లుగా వారుఉంటే వారిని మంచివారు అంటాము, మన మనస్సుకు వ్యతిరేఖంగా ఉంటే వారిని చెడ్డవారు అంటాము. మనం అనుకొన్నట్లుగా వారు ఎందుకు ఉంటారు. వారి పద్దతి ఏదో వారిది, వారి సంస్కారాన్నిబట్టి వారు ఉంటారు. మనిషికి అవకాశం ఇవ్వగలముగాని బాగుచేయలేము. మనకు డబ్బుంటే మందులు కొనుక్కోగలముగాని ఆరోగ్యం కొనుక్కోలేము. భగవంతుడు కర్మఫలదాత. కర్మ ఎంతనిజమో కర్మఫలం ఇచ్చేవాడు కూడా అంతే నిజం. ఫలానాశరీరం నాది, ఫలానాపేరు నాది అని నీవు అనుకొంటున్నావు కదా, అది నిజం అనుకొంటున్నావు కదా, అలాగే దేవుడు కూడా నిజం. బ్రహ్మం వీటిఅన్నింటికి అతీతమైనది. బ్రహ్మానుభవం

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు**

| | | |
|---|---|---|
| 21 టు 25-2-04 | అరుణాచలం | 1 |
| 26-1-2004 | పిట్లవానిపాలెం | 11 |

Visit us @ www.srinannagaru.com



పొందటానికి ప్రయత్నంచెయ్యి. సాధన అంటే ఏమీలేదు ఇప్పుడు మన మనస్సు మనకు శత్రువుగా ఉంది, దానిని మిత్రుడుగా మార్చుకో, అదే సాధన. మనకు హృదయంలోనుండి నేను అనే తలంపు వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక మనస్సు వస్తోంది, మనస్సు వచ్చాక దేహం వస్తోంది, దేహం వచ్చాక లోకం వస్తోంది, తరువాత విషయాలు అన్నీ వస్తున్నాయి. మొత్తం గొడవఅంతా హృదయంలో నుండే వస్తోంది, అక్కడికి చేరేవరకు మనం నిర్వాణస్థితిని పొందలేము. నీవు పోగొట్టుకోవలసింది అంటూ ఏమీలేదు, కల్పించుకొన్నది వదిలేస్తేచాలు. కొంతమంది వారిమాటే అందరూ వినాలి అంటారు, దానివలన నష్టం వచ్చినాసరే వారి మాటే వినాలి అంటారు, అది ఒక వికారం.

శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. అనుకొనేది బ్రహ్మంకాదు, బ్రహ్మం ఏమీ అనుకోదు, జగత్తు, జీవుడు, ఈశ్వరుడు బ్రహ్మంనందు కల్పించబడ్డాయి. అంటే దేవుడులేడు అనికాదు, ఉన్నాడు, మనలాగ ఉన్నాడు, మనం ఉంటే కర్మఫలాన్ని ఇచ్చే ఆయనా ఉన్నాడు. ఇప్పుడు మనం ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి ఆయనాఉన్నాడు. ఇప్పుడు మనం తొంబై అనుకొంటాము. మనం అనుకొనేవి అన్నీ జరుగుతున్నాయా? లేదు. కాని ఈశ్వరుడు సత్యసంకల్పుడు, ఆయన సంకల్పమే జరుగుతుంది. మనం అనుకోకపోయినా ఈశరీరం ద్వారా జరగవలసింది జరిగిపోతూ ఉంటుంది. కాని మనం అనుకోకుండా ఉండలేము, కారణం దేహాత్మబుద్ధి. మనం రోజూ అన్నం తింటున్నాము, రోజూ చూసే ప్రపంచాన్నే చూస్తున్నాము. ఇలా రోజూ చేసిన పనులే చేస్తున్నాము. ఇది కాదు మనపని, మనం ట్రైనింగ్ పొందటానికి ఈభూమిమీదకు వచ్చాము. నువ్వు అనుకొన్నట్లు ప్రపంచం ఉండదు, అది ఎలా ఉండాలో అలాగ ఉంటుంది. నిన్ను నీవు బాగుచేసుకోవటం మానివేసి ప్రపంచాన్ని బాగుచేయాలి అనుకోవటం అది మాయలో భాగం. రామకృష్ణమఠం పెట్టేటప్పుడు కొంతమంది స్వామీజీలు వివేకానందతో వద్దని చెప్పారు. అప్పుడు వివేకానంద వారికి ఏమి చెప్పారు అంటే 24 గంటలు మనం జపధ్యానములు చేయలేము. అందుచేత లోకహితంకోసం కొన్ని పనులు చేద్దాము, కీర్తికోసంకాదు, మన గమ్యం నిర్వాణస్థితి, మోక్షస్థితిని పొందటం. ఆస్థితిని పొందటానికి లోకహితవు కూడా కోరుకొందాము, దానికోసం మఠం స్థాపిందాము అని స్వామీజీ చెప్పారు. ఈమధ్య ఒకచోటకు పరామర్శకోసం వెళితే అక్కడకు ఎమ్.ఎల్.ఎ. గారు వచ్చారు. ఆయన చెప్పినది ఏమిటిఅంటే రాజకీయాలలో ఉండటంవలన చూడాలని వచ్చాను. వెళ్ళాలని వెళ్ళటంకాదు, ఓట్లు కోసం ప్రతీచోటకు వెళ్ళవలసివస్తోంది. రాజకీయాలలో ఉండటంవలన ఈతిరగటం తప్పదు అన్నారు. మానవమనస్సు అలా ఉంటుంది. వివేకానంద చెప్పేది ఏమిటి అంటే పరామర్శకు వెళ్ళాలంటే వెళ్ళుకాని నీవు ఏపనిచేసినా అది నీచైతన్యస్థాయి అభివృద్ధిఅవ్వటానికి సహకరించాలి, అది చూసుకో. నీవు లోకహితవు కోసం పనిచెయ్యి, బ్రహ్మానుభవం పొందటానికి అదినీకు సహకరిస్తుంది. ఇక్కడ ఎమ్.ఎల్.ఎ చెప్పినది, స్వామీజీ

చెప్పినది చూడండి. ఈ రెండుపనులూ పైకి ఒకలాగే ఉంటాయి, లోపలకు వెళ్ళిచూస్తే ఎంతదూరమో, తూర్పుపడమరకు ఉన్నంతదూరం.

ఈదేహం భూమిమీదకు వచ్చాక అది ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది, అది నిర్ణయింపబడే ఉంటుంది. ప్రారబ్దం దేహానికి సంబంధించినదే. ఆ దేహంతో నీకు తాదాప్యం లేనప్పడు, దేహం ప్రారబ్దం అనుభవిస్తూ ఉంటుంది, నీవు ఆనందంగా ఉండవచ్చు, ముల్లు గుచ్చుకొన్నట్లుగా కూడా నీకు ఉండదు. ప్రారబ్దం కూడా సత్యంకాదు. నేను ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అనుకొనేవాడు ఎంతనిజమో ప్రారబ్దం కూడా అంతేనిజం. హృదయంలో నుండి నేను అనే తలంపు వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక మనస్సు, దేహం, లోకం అన్నీ వస్తున్నాయి. నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో అక్కడకు దానిని పంపగలిగితే ఈ దేహం, లోకం మొత్తం అన్నీ అణిగిపోతాయి అంటే వేదన నశిస్తుంది. ఇదివరకు స్పీడుగా లోకంలోనికి దూసుకొని వెళ్ళిపోయేవారము, ఇప్పడు అలా వెళ్ళలేకపోతున్నాము, పోనీ భగవదనుభవం పొందామా అంటే అదీలేదు అని ఒకరు అడుగుతున్నారు. అది సాధనలో ఒక స్టేజ్. మనం సమాజంలో ఒంటరిగా జీవించలేము, లోకంతో ఎంతోకొంత అనుబంధం ఉండాలి. లోకంతో అనుబంధం ఎంతవరకు అవసరమో అంతవరకే ఉండాలి, హద్దులు దాటివెళితే భగవంతుడికి దూరమవుతాము. అంతటా దేవుడు ఉన్నాడు అని పాముదగ్గరకు వెళ్ళి కూర్చోకూడదు. నీకు ఏది మంచిదో అది ఇతరులకు చేస్తే అది నీ చైతన్యస్థాయి పెరగటానికి సహకరిస్తుంది. పనివేరు, సాధనవేరు అని అనుకోవద్దు. సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు అని భగవాన్ చెప్పారు ఎందుచేతనంటే అలా ఇతరుల గొడవలలో కలుగజేసుకోవటంవలన మనస్సు పెరిగిపోతూ ఉంటుంది. ఏ వస్తువు అయితే అంతటా వ్యాపించి ఉందో దానిని పొందితే ఇంకమనకు ఎక్కడికి వెళ్ళాలని అనిపించదు ఎందుచేతనంటే అది అంతటా ఉంది. బ్రహ్మం తప్ప ఏదీలేదు, ఏదో ఉందని నీవు అనుకొంటున్నావు, అలా అనుకోవటం నుండి విడుదల పొందటానికే సాధన.

నీకు ఇష్టంలేనివి, నీకు నష్టం కలుగజేసే పనులు లోకంలో జరగవచ్చు. ఈ పనులు ఇలా జరుగుతున్నాయి ఏమిటి అని నీవు అనుకోవచ్చు కాని అవి నీకు ఇంకోరకంగా మేలు చెయ్యవచ్చు. అది మనకు తెలియదు, అది ఈశ్వరుడికి తెలుసు. ఇవన్నీ వ్యవహారిక సత్యములే. నీ తలంపుతో సంబంధం లేకుండా జరిగేది జరిగిపోతూ ఉంటుంది. నేను చనిపోతే ఇంటిలోనివారు అందరూ ఏమైపోతారు అని కొందరు అనుకొంటూఉంటారు, అది కర్తృత్వం, అదే దు:ఖానికి కారణం. బ్రహ్మసత్యం, జగత్తుమిధ్య అన్నారు ఆచార్యులవారు. కొంతమంది భక్తులు దీనిని అంగీకరించరు, వారు ఆచార్యులవారిని ముసుగువేసుకొన్న నాస్తికులు అంటారు. వారికి సబ్జక్టుసరిగా అవగాహన కావటంలేదు. జగత్తు వ్యవహారిక సత్యం అని చెప్పటానికి ఆచార్యులవారు అలా చెప్పారు. ద్వైతంలో ఉన్నవారు ఆచార్యులవారిని, భగవాన్‌ను అంగీకరించరు, ఆలోతులు అందక వారు అలా అనుకొంటూ ఉంటారు. నన్ను తెలుసుకో అని గీతలో భగవంతుడు చెపితే ఆ శరీరాన్ని అనికాదు, బ్రహ్మంను తెలుసుకోమని చెప్పటం. కృష్ణుడి యొక్క బొటనవేలును బోయవాడు బాణంతో కొడితే ఆ శరీరం చనిపోయింది. ఆ బోయివాడికి మోక్షం ఇచ్చి, ఆయన చనిపోయాడు. ఆస్థాయి మనకు ఉంటే మనకు మోక్షం వచ్చేస్తుంది. మనలను ఎవరైనా కొడితే 6 నెలలు తిట్టుకొంటాము. వరి కోతలు అయ్యాక కుప్పలు వేస్తారు. ఒకసారి నందుడు సాత్యకి, బలరాముడు, కృష్ణుడు ముగ్గురిని పిలిచి కుప్పలకు కాపలా కాయమని చెప్పాడు. కృష్ణుడు మాయావి. ఆయన ఏమిచెప్పాడు అంటే ముగ్గురు నిద్రచెడటం ఎందుకు, ఒకరి తరువాత ఒకరు కాపలా కాద్దాము, నేను చిన్నవాడిని కాబట్టి ముందు నేను నిద్రపోతాను, చివరలో కాపలా కాస్తాను అని చెప్పాడు, ఆయన కాపలా తెల్లవారుజామున వేసుకొన్నాడు. మొదట సాత్యకి, బలరాములు వరుసగా కాపలా కాసారు. కాపలా సమయంలో అలజడి అయితే ఎవడురా వాడు అని గట్టిగా అంటే అది రీసౌండ్ అయి మరల అదేమాటలు ఎవడురావాడు అని వచ్చేవి. కృష్ణుడు కాపాలా సమయంవచ్చాక ఈయన ఏమీ మాట్లాడకుండా కూర్చొన్నాడు, అటువైపు నుండి కూడా ఏమీ శబ్దం రాలేదు. తెల్లవారింది, కాపలా అయిపోయింది. కృష్ణుడు ఏమిచెప్పాడు అంటే మన మనస్సులో ఉన్నదే అక్కడ కనిపిస్తోంది అన్నాడు.

మనకు ఏదైనా కలిసివచ్చింది అనుకోండి. ఏదో వచ్చేసింది, వచ్చేసింది అనుకొంటాము, పోయినప్పడు ఏదోపోయింది, ఏదోపోయింది అనుకొంటాము. మనమనస్సు ఎంత నిజమో ఇదికూడా అంతేనిజం. మనం ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము. ప్రతీ చిన్నవిషయానికి ఇలా ఏదోఒకటి అనుకోవటం వదిలెయ్యి, నూటికి తొంభైపాళ్ళు సాధన అయిపోతుంది అంటున్నారు భగవాన్. ఈ అనుకోవటాలు ఎలాపోవాలి అని ఒకభక్తుడు అడుగుతున్నాడు. ఈశ్వరస్మరణ వలన అది తగ్గుతుంది. ఈశ్వరుడు ఉన్నాడు అని సజీవమైన విశ్వాసం ఉంటే అనుకోవటాలు తగ్గిపోతాయి. ఈశ్వరుడిపట్ల పాజిటివ్‌తింకింగ్ వలన అనుకోవటాలు తగ్గుతాయి. ఒకమనిషి గొప్పవాడు అవ్వాలంటే ప్రతీవిషయాన్ని పాజిటీవ్‌గా తీసుకోవాలి. స్నేహితులు, చుట్టాలు, విరోధులు, లాభనష్టం, పుణ్యపాపాలు మొత్తం ఈసృష్టి అంతాకూడా నేను అనే తలంపు అనే చిన్న బీజంలో ఉంది, ఈ విషయం మనకు అర్ధమవ్వాలి. మొత్తం ఖగోళం అంతా కూడా నేను అనే తలంపు అనే బీజంలో ఉంది, అది బరస్టు అయితే గాని బ్రహ్మానుభవం కలుగదు.

సముద్రంలో పెద్ద పెద్ద కెరటాలు, బుడగలు, తుంపరలు అన్నీఉంటాయి. దేవుడు సముద్రంలో ఉన్న పెద్దకెరటం వంటివాడు, మనం చిన్న చిన్న తుంపరల లాంటివారము. ఈ తుంపరలు, కెరటం కూడా సముద్రంలోనే ఉన్నాయి, అలాగే దేవుడు, జీవుడు కూడా బ్రహ్మంలోనే ఉన్నారు. నీవు చేసే సాధనవలన నీకు దు:ఖరహితస్థితి కలగాలి, దు:ఖరహితస్థితి కలుగకపోతే నీకు ఎంత ఐశ్వర్యం ఉన్నా, ఎంతపాండిత్యంఉన్నా, ఎంతగౌరవం ఉన్నా ఏమీ ప్రయోజనంలేదు. మీరు ఎక్కడ ఉన్నారు అనేది ప్రధానంకాదు, దు:ఖస్పర్శవస్తోంది అంటే

అజ్ఞానంలో ఉన్నట్లే. నేను లోపల ఉన్నాను అని అజ్ఞానం చెప్పదు, అది దు:ఖరూపంలో వస్తుంది. మనం అజ్ఞానంలో ఉన్నప్పుడు వారు అంతాకూడా అజ్ఞానంలో ఉన్నారు అని అనిపిస్తుంది. ఎందుచేతనంటే మనమనస్సులో ఉన్నదే అక్కడ కనిపిస్తుంది. ఈ మధ్య ఒక డాక్టరుగారు ఏమిచెప్పారు అంటే నేను ఇప్పటివరకు ఇతరులకోసం వెతుక్కొంటున్నాను కాని నాన్నగారి ప్రవచనం విన్నాక నన్ను నేను వెతుక్కొంటున్నాను. అన్వేషణ మానలేదు, అటుది ఇటు త్రిప్పకొన్నాను అని డాక్టరుగారు చెప్పారు. నోటిలో ముద్దఉంటే మాటరాదు, వస్తువు తాలుక ఎఱుకఉన్నా మాటరాదు. మనం భగవంతుడికంటే భిన్నంగా ఉన్నాము అనుకొన్నంతకాలం జన్మలు వస్తూనే ఉంటాయి.

ఉన్నది ఒక్కటే, అదేబ్రహ్మం. మనలను మనం చూసుకొని లోకాన్నిచూస్తే లోకం బ్రహ్మంగానే కనబడుతుంది, మనలను మనం చూసుకోకుండా లోకాన్ని చూస్తే మాయలో పడతాము. మనం మాయలో ఉన్నంతకాలం మనం లోపల ఉన్నాము, మనకు బయట ప్రపంచం ఉంది, దేవుడు ఎక్కడో ఉన్నాడు అని అనుకొంటూ ఉంటాము. సాధన అంటే ఉన్నదానిని కనిపెట్టటంకాదు, కల్పించుకొన్నదానిని పోగొట్టుకోవాలి. ఉన్నది ఒక్కటే అదే మనకు అనేకంగా కనిపిస్తోంది, అది తెలుసుకొంటే మాయలోనుండి ఒడ్డుకు వచ్చేస్తాము. బ్రహ్మం తాలూక ఎఱుక మనకు వచ్చినప్పడు ఇప్పటివరకు జన్మించిన జన్మలు, మనం పడిన కష్టాలు ఇవిఅన్నీ అబద్దం అని మనకు తెలుస్తుంది, వ్యవహారికసత్యంకూడా అసత్యం అని మీకు తెలుస్తుంది, మాయ అనేదిలేదు అని మీకు తెలుస్తుంది. మాయకింద కనిపించేదికూడా బ్రహ్మమే అని మీకు తెలుస్తుంది ఎందుచేతనంటే అది తప్పించి ఇంకోటిలేదు. ఉన్నదిఒక్కటే అదే మనకు అనేకంగా కనిపిస్తోంది అని ఇప్పడు మనకు తెలియదు, ఆ ఒక్కటి అంటే ఒక్కటే అనేది అనుభవంలోనికి వచ్చాక ఇది మనకు తెలుస్తుంది. మనిషిఉంటే నీడ కనిపిస్తుంది, అసలు మనిషే లేనప్పడు నీడ ఎక్కడిది? అలాగే ఏదో సత్యవస్తువు ఒకటి ఉంది కాబట్టి దానిజాలం మనకు కనిపిస్తోంది, అదే లేకపోతే ఏదీలేదు.

మనిషి వాడు ఏ మతస్థుడైనా, ఏ కులస్థుడైనా, స్త్రీఅయినా, పురుషుడు అయినా నిష్ప్రపంచస్థితిని పొందేవరకు వాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మనం ఈ ప్రపంచంలో ఉండగానే నిష్ప్రపంచస్థితిని పొందాలి. పుట్టేవారు పుడుతున్నారు, చనిపోయేవారు చనిపోకపోతే స్థలం ఎక్కడిది. అందుచేత పుట్టేవారు పుడుతూఉండాలి, చనిపోయేవారు చనిపోతూ ఉండాలి, అదే సృష్టి. ఎలక్షన్లు వస్తున్నాయి. కొత్తవారు ఏమంటున్నారు అంటే మేము పార్టీలో ఉండి చాలాకాలం నుండి ప్రజలకు సేవ చేస్తున్నాము, మాకు గుర్తింపుఉండాలికదా, మాకు టికెట్ ఇవ్వండి అంటున్నారు, పాతవారు మేము తప్పకోముఅంటున్నారు, ఎలాకుదురుతుంది. వారు ప్రజలకు సేవచేస్తున్నాము అంటున్నారు, అది సేవా అంటే సేవకాదు, వారు చెప్పేమాట నిజమైతే వారికి జ్ఞానం వచ్చేయాలి. వారు ఏమి మాట్లాడుతున్నారో వారికి తెలియదు. మనం భగవంతుడిని మాయచేయలేము



ఎందుచేతనంటే మాయ ఆయనచేతిలో ఉంది. మనమాటలో, ఆలోచనలో పచ్చితనం ఉంది, మన మెదడు ఇంకా ముగ్గలేదు, అంతా పచ్చిగా ఉంది. మేము సేవచేస్తున్నాము అంటే అది వారినివారు వంచించుకోవటం, వారు గుర్తింపుకోరుకొంటున్నారు అంటే వంచన చేసుకోవటమే. గుర్తింపు ఎవరికి అజ్ఞానానికే. గుర్తింపు కోరుకొంటున్నారు అంటే దానివలన అజ్ఞానం పెరుగుతుంది. మనం చేసేపని వలన అజ్ఞానం తగ్గాలి.

ఒకడివౌ నిను మాయమొనరించి వచ్చువారు ఎవరు ఇది నీజాలము అరుణాచలా. నీవే ఇలాకనిపిస్తున్నావు, ఆయనను తెలుసుకొన్నాక ఆయనే ఇలా కనిపిస్తున్నాడు అని మనకు తెలుస్తుంది. ఇది అంతా ఆయన జాలమే అని ఆయనను తెలుసుకొన్నాక మనకు తెలుస్తుంది. భౌతిక జీవితంవేరు, ఆధ్యాత్మిక జీవితంవేరు అనుకొంటాము, అలాకాదు, భౌతిక జీవితంలో మన బిహేవియర్‌ను బట్టే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. జయం, అపజయం సమానంగా తీసుకో అని గీతలో భగవంతుడు చెప్పాడు. జయం, అపజయం సమానంగా తీసుకోవటం వలన మనకు లోచూపు కలుగుతుంది. జయాన్ని అపజయాన్ని మనం సమానంగా చూడము అనుకోండి మనమనస్సు లోపలకు వెళ్ళదు. జయంవస్తే గర్వం, అపజయంవస్తే దు:ఖం వస్తుంది, వాటివలన మనస్సు బాహ్యాముఖమయిపోతుంది. నీవు ధ్యానం చెయ్యలేవుఅనుకో, జపం చేయలేవుఅనుకో, నాకు ఇష్టమయిన పనులు చేస్తూఉండు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనం కుర్చీలకోసం, రిబ్బన్ కటింగ్స్ కోసం, బోర్డులమీద పేర్లకోసం పేచీలు పెట్టుకొంటున్నాము, దానివలన శక్తి వృధాఅవుతుంది, కాలం వృధాఅవుతుంది ఉన్నవస్తువును ఉన్నట్లుగా గ్రహించలేకపోవటం వలన వచ్చేగోల ఇదిఅంతా.

మౌనంలో ఉండటానికి ప్రయత్నంచేస్తూ ఉంటే లోకం అంతా శూన్యంగా కనబడుతోంది, మరల తలంపులు వచ్చి బాధపెడుతున్నాయి అని ఒకరు అడుగుతున్నారు. మనమనస్సులో కషాయం ఉంటుంది. మనం జపధ్యానములు చేయటానికి ప్రయత్నం చేస్తూఉంటాము, లోపలఉన్న కషాయం బయటకు తలంపుల రూపంలో వస్తూఉంటుంది. అది మనసులో ఉన్నడస్టు. కషాయం బయటకు వచ్చేయటం మంచిది. కషాయం బయటకు వస్తున్నట్లు మనకు తెలియాలి, అది మనకు తెలియకపోతే కషాయం మరల పెరిగిపోతుంది. కషాయం అందరికి బయటకు వెళ్ళదు. మనం గమ్యంను చేరుకోవాలి, పొందవలసిన వస్తువును పొందాలి అని సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తూఉంటే ఆ సాధనయొక్క వత్తిడిని తట్టుకోలేక అది బయటకు వచ్చేయటానికి చూస్తుంది. మీకు ఎవరిమీదఅయినా ఇష్టంఉన్నా, ఎవరిమీద అయిన ద్వేషంఉన్నా అది కషాయం. అది లోపల పేరుకొని పోవటంకంటే బయటకు వచ్చేయటమేమంచిది. అదిలోపల ఉన్నంతకాలం ఏదోరకంగా నిన్ను బాధపెడుతూ ఉంటుంది. లోకంతోటి, దేహంతోటి, చదువుకొన్న చదువుతోటి మనకు ఉన్న తాదాప్యం అంటే లోకవాసన, దేహవాసన, శాస్త్రవాసన ఇవే కషాయానికి కారణం. ఇంట్లోనివారు అందరూ గౌరవించాలి అనుకోవటం దీనివలన కూడా కషాయం

పెరిగిపోతుంది. లోపల ఉన్న కషాయం మొత్తం మీద తలంపులరూపంలో వెళ్లిపోవటం మంచిది. దీనివలన రాబోయే జన్మలు తగ్గుతాయి. కాని అది బయటకు వచ్చేటప్పుడు కషాయం బయటకు వస్తున్నట్లు మనకు తెలియాలి. ఈ గొడవలు అన్నీ నేను పుట్టాను అనుకొనేవాడికి, అసలు పుట్టలేదు అన్నసంగతి నీకు తెలిస్తే ఏ గొడవలేదు, సాధన అక్కరలేదు, లోకంశూన్యం అయ్యింది అని ఎవరికి కనిపించిందో వాడు శూన్యం అవ్వలేదు అందుచేత తలంపులు వస్తున్నాయి, వాడు పరిష్కారం అవ్వాలి.

మన అస్థిత్వం దేహానికి పరిమితమై ఉంది. దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం ఇది మంచిఅని, ఇదిచెడుఅని, ఇది ధర్మంఅని, ఇది అధర్మంఅని ఇలా ఏదోరకమైన తలంపులు వస్తూఉంటాయి. ఒకోసారి భగవంతుడికి సంబంధించిన తలంపులు వస్తూఉంటాయి. దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం తలంపులు విడిచిపెట్టవు. లోకంలేదు, లోకం ఉన్నదానివలె మనకు కనిపిస్తోంది. లోకంలేదు, లోకంలేదు అని మనం అనుకొంటూఉన్నా కూడా అలా అనుకొనేవాడు ఒకడు ఉన్నాడు కదా, వాడేసమస్య, వాడు పరిష్కారం అవ్వాలి. గైడెన్స్ లోపలనుండి రావాలి. చెప్పటంవలన కొంత అర్ధమవుతుంది. సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తూ ఉంటే గైడెన్స్ లోపలనుండి వస్తుంది. నీకు లోపలఉన్న శాంతి దొరికితే అప్పుడు లోకం కనిపించినా, కనిపించకపోయినా ఇబ్బందిలేదు. ఆత్మపుట్టదు, పుట్టలేదు కాబట్టి దానికి చావులేదు. పుట్టినది చనిపోతుంది అని చెపుతూ ఏదైతే పుట్టలేదో అది నీవై ఉన్నావు అని భగవంతుడు చెప్పాడు. అది అర్ధమయితే సాధనతో పనిలేదు. కాని మనం పుట్టాము అనుకొంటున్నాము అక్కడ నుండి సాధన ప్రారంభం. పుట్టినది నీవుకాదు, పుట్టనిది నీకు అర్ధం కావటంలేదు, ఇక్కడనుండి వేదన ప్రారంభమవుతోంది, కషాయం ప్రారంభమవుతోంది. ఇల్లుగుల్లఅయినా, వల్లు గుల్ల అయినా మనకు జ్ఞానంరాదు, హృదయంగుల్ల అవ్వాలి. అది ఖాళీఅయితే పుట్టనిది ఏదో అది మనకు అనుభవంలోనికి వస్తుంది.

డబ్బుకు జ్ఞానానికి సంబంధంలేదు. దేహప్రారబ్దమును బట్టి డబ్బు వస్తూఉంటుంది, పోతూ ఉంటుంది. ప్రారబ్దమునుబట్టి ఆదేహం తయారవుతుంది. ప్రారబ్దములో ఏది ఉంటే అదివస్తుంది, పోయేది పోతుంది. వీటికి జ్ఞానానికి సంబంధంలేదు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా మనం ఇముడ్చుకోవాలి, ఇముడ్చుకోకపోతే శక్తిపెరగదు. స్నేహాలు, బంధుత్వాలు, విరోధాలు వీటిఅన్నింటిని స్వప్నంలాగ ప్రాక్టీసుచెయ్యి. అలా ప్రాక్టీసుచేయటంవలన కషాయం అంతాపోతుంది, మనస్సు అణిగిపోతుంది. జీవితంలో జరిగే ప్రతీసంఘటన అది డబ్బురావటం అయినా, డబ్బుపోవటంఅయినా ఏదైనాసరే స్వప్నమే, అలా మనం ప్రాక్టీసుచెయ్యాలి. చాలా విషయాలు మనం భరించాలి. మా ఇంటికి భక్తులు వస్తూఉంటారు. ఫలానా స్థలం అమ్మమని అడుగుతున్నారు, వారికి కలుస్తుంది అని చెపుతారు ఎలా బాగుంటుందో అలా చేసుకోండి అని చెపుతూఉంటాము. వారికి ఆ స్థలం అమ్మటం



ఇష్టంలేదు అనుకోండి. మాకు అమ్మటం ఇష్టమేకాని నాన్నగారు వద్దని చెప్పారు అని వారికి చెపుతారు. ఇలా అనేకమంది శత్రువులు అవుతున్నారు. ఇదికూడా స్వప్నంలో ఒకభాగమే. మనం అనుకొన్నా, అనుకోకపోయినా ఇదీ స్వప్నమే దానిని డ్రీమ్ కిందప్రాక్టీసు చేయటంవలన మనం హర్ట్ అవ్వము.

సుబ్రహ్మణ్యుడు అంటే జ్ఞానమే శివుడు పాతరూపాయి అయితే సుబ్రహ్మణ్యుడు కొత్తరూపాయి. చీకటిలోనుండి వెలుతురులోనికి, అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, మృత్యువులోనుండి అమృతత్వంలోనికి రమ్మని వేదమాత చెప్పింది. పుట్టినది చనిపోతుంది, నీవు అసలు పుట్టలేదుకదా. ఏదైతే ఎప్పుడూ ఉందో దాని స్వరూపమే జ్ఞానం, లేనివస్తువుకు జ్ఞానం ఏమిటి? శరీరానికి జ్ఞానం ఏమిటి? భయం ఎందుకు వస్తోంది? మనంకాని దేహంతో తాదాప్యం పొందటంవలన భయం, ద్వేషం, అసూయ అన్నీవస్తున్నాయి. ఈ రాక్షసగుణాలకు అన్నింటికి బీజం అక్కడే ఉంది. అది మిస్అయిపోతున్నాము, ఏదోభారతం, రామాయణం చదివేస్తున్నాము, ఉన్నది ఒక్కటేవస్తువు, అది అనుభవంలోనికి వచ్చేవరకు ప్రతీ జన్మలోను భయం వెంటాడుతుంది. నీవు ఇతరులకు చేసే గౌరవాలు కూడా భయంవలననే చేస్తున్నావు. భయం ఎందుకు ఉండకూడదు, దానివలన నష్టం ఏమిటి? భయం ఎక్కడఉంటే అక్కడ దు:ఖం వస్తుంది. అమృతానుభవం పొందేవరకు భయం ప్రతీ జన్మలోను వెంటాడుతుంది. ఒకటి ఉంటే శాంతి, రెండుఉంటే గలాటా. రెండులోనుండి భయం, ద్వేషం, శత్రుత్వం ఇవి అన్ని వస్తున్నాయి. పేచీలు అన్నీ దేహంతో తాదాప్యం పొందే నేనులో నుండి వస్తున్నాయి. పేచీలు ఎలా ఉంటాయో చూడండి. ఈ మధ్య హైదరాబాద్‌లో ఒకరు ఫంక్షన్ చేసుకొన్నారు. మావగారిది వేరేవూరు ఆయన హైదరాబాద్‌లో ఉన్న తమ్ముడికి బట్టలుకొని ఇమ్మని చెప్పారు. ఆయన బట్టలు తీసుకొనివెళితే ఆయనే పెట్టాలి, మీరు తీసుకొని రావటం ఏమిటి అని పేచీపెట్టారు. పోనీ తీసుకొనివెళ్లిన వారు సహనంగా ఉండి ఆయనకు వీలు అవ్వలేదు, నేను తీసుకొని వచ్చాను అనిచెపితే సరిపోతుంది కాని వారి మాటలకు ఈయన కోపం తెచ్చుకొని తీసుకొంటే తీసుకోండి లేకపోతే రోడ్డుమీద పారేయండి అన్నారు. ఆయన కూడా అలా అనకుండా ఉంటే బాగుండేది. ఫంక్షన్ చేసుకొనేవారు అయినా ఎవరు ఇస్తే ఏమిటి బట్టలు పంపారుకదా అనుకొంటే ఏమీలేదు. ఇద్దరూ అలా అనుకోకుండా పేచీలు పెంచుకోవటం. ఇలా పిచ్చిపిచ్చి గొడవలతో కాలం గడిచిపోతుంది, ఈలోపు చావు వచ్చేస్తుంది. వీటివలన కాలం, శక్తి వృధా అవుతుంది, మనస్సు పొల్యూట్ అవుతుంది. వీటివలన ఆధ్యాత్మికంగానే కాదు, భౌతికంగా కూడా ఏమీ కలిసిరాదు. ఈ పేచీలకు అన్నింటికి కారణం దేహంతో తాదాప్యం పొందే నేను. మనం కాలాన్ని ఎలా పాడుచేసుకొంటున్నామో చెపుతున్నాను.

జపం, తపం, ధ్యానం చేసుకోండి, మంచిదే. మనం పనిచేసేటప్పుడు పని జరుగుతూ ఉండాలి, చేసే మనం కనబడకూడదు. ఇప్పుడు సుబ్బారావుగారి ద్వారా ఒకపని జరుగుతోంది

అనుకోండి, పని జరుగుతూ ఉండాలి కాని సుబ్బారావుగారు కనబడకూడదు. అప్పుడు జపం, తపం అక్కరలేకుండానే ఆయనకు జ్ఞానం వచ్చేస్తుంది. ఆ బిహేవియర్ కనుకవస్తే ఆమనిషి జ్ఞానం దగ్గరకు వెళ్ళనక్కరలేదు, జ్ఞానమేవచ్చి అతనిని వరిస్తుంది. నిప్పువేడి వేరుకాదు, సూర్యుడుకాంతి వేరుకాదు, ఆత్మసుఖం వేరుకాదు, ఆత్మను విడిచిపెట్టి సుఖం ఉండదు. మీకు ఏదైనా కోరిక నెరవేరింది అనుకోండి, కోరిక నెరవేరటంవలన సుఖంరాదు, కోరిక నెరవేరటంవలన మనస్సు లోపలకు వెళుతుంది, అక్కడ ఉన్న సుఖాన్ని పొందుతుంది. ప్రపంచంలో ఎక్కడా సుఖంలేదు, ఒక్క చైతన్యంలో తప్ప ఎక్కడా సుఖంలేదు. మీ విరోధులకు కాళ్ళువిరిగాయి అనుకోండి, మీకు ఇష్టంలేనివారికి అపకారం జరిగింది అనుకోండి అప్పుడు కూడా మీకు సంతోషం కలుగుతుంది. కోరిక నెరవేరటం వలన మనస్సు అంతర్ముఖమై ఆత్మలో కలవటంవలన మీకు సంతోషం వస్తోంది, అంతేగాని విషయాల నుండికాదు. ప్రపంచంలో సుఖం ఉంది అని అనుకోవటం వలన మనస్సు బాహ్యాముఖమవుతోంది. ప్రపంచంలో ఎక్కడా, ఏ వస్తువులోను సుఖంలేదు. ప్రపంచం అబద్ధం, అబద్ధంలో సుఖం ఎక్కడ ఉంటుంది. లోకంలో సుఖం ఉంది అని నీ మనస్సు బయటకువెళ్ళి సుఖంకోసం వెతికి భంగపడి మరల లోపలకు వస్తోంది, మరల లోకంలోనికి వెళ్ళి వెతికి భంగపడి మరల లోపలకు వస్తోంది, అది అలా తిరగటానికి అలవాటుపడింది. ఇలా వేలాదిజన్మలు వెళ్ళిపోతున్నాయి. బయట ఏమీ సుఖంలేదు అని ముందు నీకు అర్ధమవ్వాలి, నీ స్వరూపమేసుఖం, నీవే సుఖం,  దేనికోసమైతే మనస్సు వెతుకుతోందో అది నీవే అన్నసంగతి దానికి తెలియాలి. మనకు మనమే గురువుగా ఉండి టీచ్ చేసుకోవాలి, మన మనస్సుకు మనమే చెప్పకోవాలి, మన మనస్సుకు ఏదైనా చెపుతున్నాము అనుకోండి, అది ఎదురుతిరుగుతూ ఉంటుంది, ఆ ఎదురుతిరగటం తగ్గించుకోవటమే సాధన.

ఈ సృష్టియొక్క అస్థిత్వంఅంతా రాగద్వేషముల మీద ఆధారపడిఉంది. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్ప ఏమీలేదు. మీకు ఇష్టంలేని వారిని తిడుతూ ఎవరైనా వ్రాస్తే అది భగవద్గీతకంటే ఇష్టంగా చదువుతాము, దానికి మీ మనస్సులో ఉన్న ద్వేషం కారణం శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో అని భగవంతుడు గీతలో చెప్పాడు. ప్రపంచం అంతా రాగద్వేషములతో నిండిఉంది, ప్రతీదానికే స్వార్ధమే, ఇటువంటి మనుషులు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవద్దు. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొంటే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. శాస్త్రము భౌతికకారణాల వలన చెప్పినదికాదు, మిమ్మల్ని సుఖస్వరూపం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి చెప్పినది, అందుచేత దానిని ప్రమాణంగా తీసుకో. జీవుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకోవద్దు. వాడికి ఇష్టంఉంటేఒకలాగ, ఇష్టం లేకపోతే ఒకలాగ చెపుతాడు, రోజుకు ఒకరకంగా మాట్లాడతాడు, వాడి మాటను ప్రమాణంగా తీసుకోవద్దు, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకో దేవుడు ప్రమాణాలకు అందనివాడు, వాడు అప్రమేయుడు, మన కొలతలకు అతీతుడు,  అందువలన ఆయన మాటను



ప్రమాణంగా తీసుకో.

మనలనుచూసి కొంతమంది ఇష్టపడతారు, కొంతమంది ఇష్టపడరు. వారు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా మనకు వచ్చే నష్టం ఏమిటి? వారు ఇష్టపడాలి అని మనం అనుకోవటం వలన వారు ఇష్టపడకపోతే దు:ఖం వస్తోంది. వారు ఇష్టపడాలి అని అనుకోవటం కూడా అజ్ఞానంలో భాగమే. లోకంలేదు, కాని ఉన్నదానివలె నీ కళ్ళకు కనబడుతోంది అంతే. మనకు జ్ఞానం రాకుండా మన రాగద్వేషములే అడ్డువస్తున్నాయి అని మనకు తెలియటం లేదు. నీవు ఎవరిని భయపెట్టవద్దు, నీవు ఇతరులకు భయపడవద్దు అని భగవంతుడు చెప్పాడు. మీరు చాలామంచిపని చేసారుఅనుకోండి, మీరంటే ఇష్టంలేనివారు సంతోషించరు కారణం ద్వేషం.  ఇంత మంచిపని చేసినా ఎవరూ గుర్తించటంలేదు, ఎవరూ సంతోషించటంలేదు అని మీరు అనుకొంటే వారి ద్వేషం ఎంతో, మీరు అలా అనుకోవటం కూడా అంతే, రెండూ అజ్ఞానమే. అక్కడ ఎంత అజ్ఞానం ఉందో ఇక్కడకూడా అంతే అజ్ఞానం ఉంది. తిరిగి తిరిగి ఈ చెడ్డఅంతా దేహము నేను అనే తలంపులో నుండే వస్తోంది, ఈ వికారాలు అన్నీ అక్కడ నుండే వస్తున్నాయి, అదే సైతాను. రాగం ఉన్నచోట కోరిక, ద్వేషం ఉన్నచోట కోపం ఉంటాయి. ద్వేషం ఎంతవరకు వెళుతుంది అంటే ఈ మధ్య భర్తే, భార్యను చంపేసాడు. పాపం ఆవిడ భర్తను బాగానే చూస్తోంది. కాని ఆవిడకు పేరురావటం, డబ్బుసంపాదన ఎక్కువగా ఉండటం భరించలేక ద్వేషం ఎక్కువ అవ్వటంవలన ఆవిడను చంపేసాడు. ద్వేషం అంతదూరం తీసుకొని వెళుతుంది. వేరుభావన ఉన్నప్పుడు భర్త, భార్య అని ఏముంది? ఎవరైనా సరే ద్వేషం వచ్చేస్తుంది. మనం వివేకం ఉపయోగించుకొని విడదీసుకొంటే ఏమీలేదు. ఇప్పుడు లక్ష్మి మనలను ప్రేమిస్తోంది అనుకోండి, లేకపోతే ద్వేషిస్తోంది అనుకోండి, ఏదైతేఏముంది? విడదీసుకొంటే ఏమీలేదు. అదీ తలంపే, ఇదీ తలంపే. అందరిచేత నేను గౌరవింపబడాలి అని అనుకొంటారు అనుకోండి, అందరూ ఉన్నారా? అందరూమాయే, ఉన్నది ఒక్కటే.

మనలో ఏదోఉంది, ఏదోఉంది అది పోగొట్టుకోవాలి అనుకొంటున్నాము. ఏదీలేదు అని అర్ధమయితే పోగొట్టుకొనేది ఏదీలేదు. ఏదోఉంది అనుకొనేది మనకల్పనే, సాధనకూడా మనకల్పనే. మనకు ఈశ్వరుని దయలేకపోతే ఎన్ని గ్రంధాలు చదివినా ఏమీలేదు, ఒకో గ్రంధం ఒకోముడి అనిపిస్తుంది, అసలు ఆయన కరుణ రావాలి. ఇప్పుడు స్కూల్లు, కాలేజీలు వచ్చాయి. పూర్వం ఉపనిషత్‌లు చెప్పిన ఋషులు ఎక్కడ చదువుకొన్నారు. మనం తెలివితేటలుగా ఉండవచ్చుగాని, అతితెలివితేటలు మంచిదికాదు. తెలివి ఎంతవరకు అవసరమో అంతవరకే ఉపయోగించాలి. ఇప్పుడు కళ్ళజోడు ఉంది అనుకోండి, అవసరమైతే వాడతాము లేకపోతే తీసి ప్రక్కన పెడతాము, తెలివితేటలను కూడా అలాగ వాడుకోవాలి. తెలివిమంచిదేకాని అతితెలివివలన నష్టాలు వస్తాయి, ఉన్నది ఊడిపోతుంది. అతి తెలివితేటలు ఉన్నవారు లౌక్యంగా మాట్లాడతారు, వారి ఉద్దేశంలో అది తెలివిలో భాగం.

అతితెలివివలన ఇబ్బందులు వస్తాయి. మనలోపలఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వస్తే ఇంక చూడటానికి ఏమీ లేదు, వినటానికి ఏమీలేదు అని మనకు తెలుస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 26-1-04, పిట్లవానిపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన జీవితం అంతా కల్పితమే. పుట్టుక కల్పితం, శరీరం చావుకూడా కల్పితమే, సంసారం కల్పితం. కల్పితంకానిది చైతన్యం, ఆత్మ. కల్పితంకానిదానిలో నుండి సుఖం, శాంతి, ఆనందం వస్తాయి. కల్పితంలో నుండి దు:ఖం, అశాంతి వస్తుంది. మన జీవితంలో వచ్చే హెచ్చుతగ్గులు, సుఖదు:ఖాలు అంతా కల్పితం. కల్పితంకాని వస్తువు ఒకటి ఉంది, అదేబ్రహ్మం, అదే చైతన్యం. అది మన హృదయంలో అంతర్యామిగా ఉంది, అంతటా వ్యాపించిఉంది. సూర్యుడికి వెలుతురు ఎంతసహజమో, అగ్నికి వేడి ఎంతసహజమో, చైతన్యానికి సుఖం, ఆనందం, శాంతి అంత సహజం. పుట్టుక కల్పితం, పుట్టుకలేనిది సహజం. శరీరంపుట్టింది, చైతన్యానికి పుట్టుకలేదు. ఆ చైతన్యం తాలుక సుఖాన్ని, శాంతిని అనుభవైకవేద్యం చేసుకోవటమే మన జీవితలక్ష్యం. మనం గుడులచుట్టూ తిరగటం నేర్చుకొన్నాము, పక్షులలాగ ఎగరటం నేర్చుకొన్నాము, చేపలలాగ ఈదటం కూడా నేర్చుకొన్నాము కాని లోపలకు వెళ్లటం నేర్చుకోలేదు. లోపలకు వెళ్లటం మనకు అలవాటులేదు. మనకు ఏ తలంపు అయితే నేనుగా వ్యక్తమవుతోందో దానిలోనుండి విడుదలపొందటానికి యోగంతో కూడిన జ్ఞానం అవసరం. దేహమే నేను అనే బుద్ధిలోనుండి విడుదల పొందటమే మన సాధనయొక్క గమ్యం. సముద్రంలో కెరటాలు అలజడిగా ఉంటాయి, లోపలకు వెళితే ప్రశాంతంగా ఉంటుంది. మనం పైపైన జీవిస్తున్నాము కాని ఇంకా లోపలకు వెళ్లటం నేర్చుకోలేదు. ఏ తలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో అదే తొలితలంపు, అదేమూలతలంపు. దానినిబట్టే ఇతర తలంపులు వస్తున్నాయి. మూలతలంపు మూలంలోనే భగవంతుడు ఉన్నాడు. మూలతలంపును దాని మూలంలోనికి ఉపసంహరించగలిగితే, అక్కడ ఉంచగలిగితే మనంపోము, మనం ఎవరిమో మనకు తెలుస్తుంది. ఈ శరీరం ఉండగానే జీవలక్షణాలను పోగొట్టుకొంటే గుణాలకు అతీతమైనస్థితిని పొందుతాము. ప్రకృతిగుణాలను తగ్గించుకోవాలి, అవిఅన్నీ కల్పితములే. మనం సాధనచేసి మనం కల్పించుకొన్న విషయాలను పోగొట్టుకోవాలి. మనం కల్పించుకొన్న విషయాలలోనుండి మనం విడుదలపొందితే లోపలఉన్న సత్యవస్తువు మనకు తానుగా వ్యక్తమవుతుంది. ఆత్మాన్వేషణ చేయాలనే కోరిక కలగటమే దైవకృప. మనందరకు హీరోలము అవ్వాలనిఉంది గాని జీరో అవ్వాలని ఎవరికీలేదు. ఎవడైతే తన మనస్సును జీరో చేసుకొంటున్నాడో వాడేభక్తుడు, వాడికే పరమేశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. ఈశ్వరునియొక్క స్వరూపమే జ్ఞానం, ఈశ్వరునియొక్క స్వరూపమే ఉండటం. ఈశ్వరస్వరూపం పొందాలంటే మన మనస్సును సున్న చేసుకోవాలి. మనస్సును సున్న



చేసుకొంటే మనం ఆత్మజ్ఞానానికి వారసులవుతాము.

మనకు జ్ఞానం రాకపోవటానికి కారణం ఏమిటిఅంటే మనకుదయలేదు, సమానత్వంలేదు, మనస్సులో ఉన్న హెచ్చుతగ్గులుపోలేదు. గీతలో భగవంతుడు చెప్పినమాట ఎంతస్థిరంగా ఉందో, ఎంత కాలాతీతమైనదో అలాగ మన మనస్సుకూడా అంతస్థిరంగాఉంటే, అది అణుగుతుంది, అణిగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. జ్ఞానం పొందాలి అనే కోరిక కలగాలి అంటే సత్పురుషుల సహవాసం ఉండాలి, సత్కర్మచేసి ఉండాలి, పెద్దలకు సేవచేయాలి. పెద్దలకు సేవచేయటంవలన కూడా మనోనిగ్రహం వస్తుంది. వృద్ధులకు మనం చేయగలిగిన సేవ చేస్తూఉంటే దానివలన మనకు రెండులాభాలు కలుగుతాయి. లోకానికి ఎంతోకొంత హితవుచేసినట్లు అవుతుంది, లోపలకువెళ్లి చూసుకొంటే మనస్సు పల్చబడుతూ ఉంటుంది, జ్ఞానసముపార్జనకు మనస్సు సమాయత్తం అవుతుంది. వృద్ధులకు సేవచేయటం వలన మనకు తెలియకుండానే ఇవి రెండూజరిగిపోతాయి. మనం ఎందుకుపనికిరాని విషయాలను గుర్తుపెట్టుకొంటాము, ఎందుకుపనికిరాని వారితో సహవాసం చేస్తూఉంటాము. అందువలననే మనకు జిజ్ఞాస కలగటంలేదు. గాఢనిద్రలో మనంకాని దేహంలోనుండి, మనంకాని మనస్సులోనుండి, మనంకాని విషయములనుండి విడుదలపొందుతాము. గాఢనిద్రలో మనం సుఖంగా ఉన్నాముగాని ఎరుకలేదు. జాగ్రదవస్థలో ఎరుక ఉందిగాని సుఖంగాలేము. గాఢనిద్రలో ఉన్నసుఖం, జాగ్రదవస్థలోఉన్న ఎరుక ఒకేసారి మనకు అనుభవంలోనికి రావాలి. అప్పుడు అలౌకిక సుఖం, అలౌకిక ఆనందం వచ్చి నిన్ను వరిస్తుంది. అప్పుడు వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. అప్పుడు వాడు దేశకాలములకు బంధింపబడి ఉండడు, దేహంలో ఉండగా దేహరహితంగా ఉంటాడు, అన్నింటికి అతీతంగా ఉంటాడు. వాడిదగ్గర ఉంటే వాడినుంచి వచ్చే శాంతితరంగాలు, కాంతితరంగాలు మనమీదపడి ఆత్మజ్ఞానాన్ని మనం కూడా పొందాలి అనే కోరిక ఉదయిస్తుంది. రాబోయేజన్మ ఎటువంటిది వస్తుందో అని మనం ఆలోచిస్తూ ఉంటాము. గాఢనిద్రలో ఎవడికీ జన్మల గురించి ఆలోచనలేదు. ఎందుచేతనంటే గాఢనిద్రలో కల్పించే మనస్సులేదు. ఈ కల్పించే మనస్సు వచ్చాక రాబోయేజన్మల గొడవ, పూర్వజన్మల గొడవ అంతావస్తోంది. అంటే మనస్సు ఎంతనిజమో అది కల్పించే ఈజన్మలు కూడా అంతేనిజం, అవి నిజం అని అనుకోవటంవలన మనకు దు:ఖం వస్తోంది. మన మాటద్వారా ఈశ్వరుని దయను సంపాదించాలి. కొంతమంది చాలా ఉద్రేకంగా మాట్లాడుతూఉంటారు. ఇలా ఉద్రేకంగా మాట్లాడి ఇతరులను ఎంత ఇబ్బందిపెడుతున్నామో వారికి తెలియటంలేదు. మీకు ఏదైనా దు:ఖం వస్తూఉంటే దానికి కారణంలేదు అనుకోవద్దు, ఏదోకారణం ఉంటుంది. ఆ కారణాన్ని తీసివేస్తే దు:ఖంలేదు. మనస్సు ఉన్నంతకాలం అది కల్పించిన విషయాలు కూడా ఉంటాయి. ఈ విషయాలకు ఏ మనస్సు అయితే కారణమో అది నశించేవరకూ అది కల్పించిన విషయాలు ఉంటాయి, మనస్సు నశిస్తే అది కల్పించిన

విషయాలు కూడా నశిస్తాయి.

మనకు ఆత్మబుద్ధిలేదు, శవబుద్ధిఉంది. శవబుద్ధి ఉన్నంతకాలం శవాలను మోస్తూ ఉండవలసిందే. మనమాటలోగాని, చేతలోగాని దేహభావన తగ్గించుకొంటూరావాలి, అదే తపస్సు. ఆత్మను కేంద్రంగా పెట్టుకొని చేసే ప్రతీపని కూడా యజ్ఞంతో సమానము. ఆహారం తగుమాత్రంగా తీసుకోవాలి. ఆహారం అతిగా తింటే అది మనలను తినటం ప్రారంభిస్తుంది. మనకు ఏదైనా కోరికవస్తే ఆ కోరికకూడా పోతూఉంటాము. ఆ కోరికకూడా పోయేస్థితిని ఆపుచేయటంకోసమే నేను ఎవడను అనేప్రశ్న. మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో దానిచుట్టూ తిరగటం మిధ్యాజ్ఞానం, దానిలోనుండి విడుదలపొందితే ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీ మనస్సును మిత్రుడిగా చేసుకోండి, మీ మనస్సును మిత్రుడిగా చేసుకొంటే, మీ మనస్సును అదుపులో పెట్టుకొంటే మీకుఉన్న స్నేహితులుగాని, మీ బంధువులుగాని, సమాజంగాని, మీకుఉన్నధనంగాని చేయలేని సహాయం స్వాధీనమైన మనస్సు మీకు చేసిపెడుతుంది, నీవు బాగుపడతావు, బయట సహాయం నీకు అవసరం ఉండదు. అక్కడ అదిసాధించాను, ఇక్కడ ఇదిసాధించాను అని ఇలా అనుకొంటూ ఉంటాము, అది జీవలక్షణము, ఇలా అనుకొనేవాడు జీవుడు, ఏమీ అనుకోనివాడు దేవుడు. దేవుడికి పబ్లిసిటీ అక్కరలేదు ఎందుచేతనంటే అంతాతానే, ఆయనకు భిన్నంగా ఏదీలేదు. జీవుడికి దేహబుద్ధిఉంది కాబట్టి, వేరుబుద్ధి ఉందికాబట్టి వాడికి పబ్లిసిటీ కావాలి, అన్నీకావాలి. అహంభావన ఉన్నవాడికి అన్నీకావాలి, అదిలేనివాడికి దేనితోనూ పనిలేదు. మనకు జీవితంలో ఏదైనా చెడుసంఘటన జరిగితే భగవంతుడు ఇలాచేసాడు ఏమిటి అనుకొంటాము. భగవంతుడికంటే మించిన స్నేహితుడుగాని, భగవంతుడుకంటే మించిన బంధువుగాని మనకు లేనేలేడు. అది మనకు తెలియక ఈశ్వరుడు ఇలా చేసాడు ఏమిటి అనుకొంటాము. తాత్కాలికంగా అది మీకు చెడ్డకింద అనిపించవచ్చు, పరిణామంలో అది మీకు మంచిని తీసుకొనిరావచ్చు. అది తెలియక మీరు మనస్సులో ఆందోళన పెట్టుకొంటారు. హృదయంయొక్క లోయలలోనికి వెళ్లేకొలది ఆందోళన తగ్గిపోతుంది, అశాంతి తగ్గిపోతుంది, నీవు నిర్మలంగా ఉంటావు, శాంతిగా ఉంటావు. నీవు ఏదైతే పొందాలి అనుకొంటున్నావో తదనుగుణమైన స్నేహాలు చేయటం అలవాటుచేసుకో.

మనకు ఇష్టంలేని తలంపు వచ్చింది అనుకోండి, నువ్వురావద్దు అంటాము లేకపోతే దానినుండి తప్పకోవటానికి భగవంతుడిని ధ్యానంచేస్తాము, లేకపోతే సినిమాకు వెళ్లిపోతాము, ఈ రెండూ ఇష్టంలేకపోతే సారా తాగుతాము, ఆ సారామత్తులో తలంపులు మర్చిపోతూ ఉంటాము. అంటే తాత్కాలికంగా వాటిలో నుండి తప్పకోవటానికి చూస్తున్నారు, ఇది అంతా ఎస్కేపిజమ్ అంటున్నారు భగవాన్. ఇలా వాటిలోనుండి తప్పకోవటానికి చూడవద్దు, వాటిని పేస్‌చెయ్యి అంటున్నారు. నీకు ఇష్టంలేని తలంపు వస్తోంది అనుకో, దానిని రానియ్యి, దానిని పేస్‌చెయ్యి, ఏ తలంపుకు ఈ తలంపుకు వస్తోంది, ఈ తలంపువస్తే



నాకు దు:ఖం ఎందుకువస్తోంది, ఈ తలంపుకు నాకు సంబంధం ఏమిటి అని ప్రశ్నించుకో, దానిని పరిష్కారంచేసుకో. మనం అర్థం చేసుకొంటే మనం పోగొట్టుకొనేది ఏమీలేదు, సంపాదించేది ఏదీలేదు. మనకు స్థిరబుద్ధిలేక బాహ్యంగా ఏదో కలిసివస్తే సంపాదించాము అనుకొంటున్నాము, ఏదైనా నష్టంవస్తే పొగొట్టు కొన్నాము అనుకొంటున్నాము. నీవు సంపాదించుకొన్నా, పోగొట్టుకొన్నా అదీప్రకృతే, ఇదీ ప్రకృతే, అహంకారి చెప్పేమాటలు నిధానంగా ఉండవు, స్థిరంగా ఉండవు. మనం అహంకారి చెప్పేమాటలు పట్టుకొంటున్నాము, భగవంతుడు చెప్పినమాటలను వదిలేస్తున్నాము. వాడి బుద్ధిమంచిదికాదు, వీడి బుద్ధి మంచిదికాదు అని అనుకొంటాము. మనబుద్ధి సరిగాలేనప్పుడు వారి బుద్ధులు మంచివికాదు అనిపిస్తుంది. వారి బుద్ధులు మంచివికాకపోతే మనకు వచ్చే నష్టం ఏమిటి? మనబుద్ధిని మనం సరిచేసుకొంటే మనం తరిస్తాము. వర్షం వస్తోందిఅనుకో, వర్షం నువ్వు ఆగమంటే ఆగదు, గొడుగువేసుకొని వెళ్లిపో. ముందు నువ్వు తరించటానికి ప్రయత్నం చేసుకో, తరువాత నీ ద్వారా అనేకమంది తరింపబడతారు. ఎవరినో పరిశీలించటంకాదు. ఏదైతే నేను నేను అంటున్నావో ఈ నేను ఎవరుఅని నీవు ప్రశ్నించుకో. దానిని నువ్వు వద్దు వద్దు అనకు, వద్దన్నా అది వచ్చి మీద పడుతుంది. ఈ తలంపు ఎవరని ప్రశ్నించుకో. దానిని పరిశీలించు, దానిని పరిష్కారం చేసుకో సంస్కర్తలు కావలెను, సంస్కర్తలు కావలెను ఇతరులనుకాదు సంస్కరించటం, తననుతాను సంస్కరించుకొనేవారు కావాలి. ఎవరైతే వారినివారు సంస్కరించుకొంటున్నారో వారి దేహము ఈశ్వరుడి చేతిలో పనిముట్టు అవుతుంది.

మనకు అన్నీఉన్నాయి, అశాంతిగా ఉన్నాము. మన తిప్పలు ఇలాఉన్నాయి కాని లక్ష్మణుడు రాజ్యాన్ని వదులుకొన్నాడు, భోగాలను వదులుకొన్నాడు అయినా శాంతిగా ఉన్నాడు కారణం ఆయన దేవుడికూడా ఉన్నాడు. దేవుడిని ఒక్కడిని వదిలేస్తే, మనకు అన్నీఉన్నా అశాంతిగా ఉంటాము. మనం అన్నీ వదిలేసుకొని దేవుడికూడా ఉంటే శాంతిగా ఉంటాము. మాటల సందర్భంలో ఒకసారి రాముడు లక్ష్మణుడితో నీకంటే భరతుడు అంటే నాకు ఇష్టంఅన్నాడు. అప్పడు లక్ష్మణుడికి వికారం కలుగలేదు, ఆందోళనలేదు. రాముడిఇష్టమే తన ఇష్టం, తనకంటూ ప్రత్యేకంగా ఇష్టాలులేవు. రాముడికి భరతుడు అంటేఇష్టం కాబట్టి భరతుడు అంటే నాకూ ఇష్టమే అనుకొన్నాడు. అదే మనం అయితే వెంటనే కోపం వచ్చేస్తుంది, కూడా ఉండి చాకిరీ చేస్తున్నాము, ఈ చాకిరీచేసేవాడు పోయాడు, ఎక్కడో అయోధ్యలో ఉన్నవాడు అంటే ఇష్టం అంట వీడికి, అని రాముడిని వదిలేస్తాము, అంటే దీనికి మనపాడుబుద్ధి కారణం. మనలో లక్ష్మణుడులాగ ఎవడు ఉంటాడు? అసలు ఈ మాటలు మనం భరించగలమా? కాని లక్ష్మణుడు రాముడి ఇష్టమే తన ఇష్టం అనుకొన్నాడు. లక్ష్మణుడికి జ్ఞానం రాకుండా మనం ఆపుచేయగలమా? లక్ష్మణుడిబుద్ధి మనకు ఉందా? మనకు జ్ఞానం వచ్చేదిలేదు, లక్ష్మణుడికి రాకుండా ఆగేదిలేదు. లక్షణుడికి భగవంతుడి ఇష్టమే తన ఇష్టం,

ఇంకసాధనతో పనిలేదు. ఒకసారి విశ్వనాథ సత్యనారాయణగారు ఆయన ఇంటికివచ్చిన ఒక పండితుడికి కాఫీ ఇచ్చి, తరువాత ఆ గ్లాసు తొలిపేయండి అన్నారట. ఆయన అలా అంటారు అని ఆ పండితుడు అనుకోలేదు, అయినా ఎందుకు అన్నాడో ఆవిషయం మనకు అనవసరం అనుకొని గ్లాసును తొలిపేసి అక్కడ పెట్టారు. అప్పుడు సత్యనారాయణగారు ఆ పండితుడితో గ్లాసు తొలిపించాను అని ఏమీ అనుకోకండి అన్నారట. అప్పుడు ఆ పండితుడు అన్నాడట ఈ మాట ఎంతబాగుందో చూడండి ఏమండీ మీరు గ్లాసు తొలిపించారు అని నేను ఏమీ అనుకోవటంలేదు, కాఫీ ఇచ్చినందుకు సంతోషిస్తున్నాను అన్నారట. అది బాగుపడేవాడిలక్షణం. అదీ పాజిటివ్‌థింకింగ్ అంటే, అది మనం నేర్చుకోవాలి.

మనం వైకుంఠంలోఉన్న దేవుడిని మోసంచేయవచ్చు, గుడిలోఉన్న దేవుడిని మోసంచేయవచ్చుకాని హృదయంలోఉన్న దేవుడిని మోసం చేయలేము. ఎందుచేతనంటే ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి, మనకు వచ్చే ప్రతీతలంపును ఆయన చూస్తూఉంటాడు. ఆయనపరమలోభి, పరమలోభివాడు అన్నీ ఎలా జాగ్రత్త పెట్టుకొంటాడో అలాగ మనలోపలఉన్న ఈశ్వరుడు రాబోయేజన్మలో మనచేత అనుభవింపజేయటానికి మనకు వచ్చే ప్రతీతలంపును ఒక్కటికూడా విడిచిపెట్టకుండా జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. కట్రాడుకు కట్టిన దూడను కొడుతూఉంటే అది అన్ని దెబ్బలుపడవలసిందే, పారిపోవటానికి అవకాశంలేదు. అలాగే దేహం నీవుకాకపోయినా దేహము నేను అనేబుద్ధిని నీకు కలుగజేసి ఈతలంపు లన్నింటిని నీచేత అనుభవింపజేస్తాడు, వాడు భగవంతుడు. సత్పురుషుల సహవాసంవలన, ఈశ్వరుని దయవలన దేహమునేను అనే తలంపుపోయిందిఅనుకోండి అప్పుడు ఆదేహము కర్మ అనుభవిస్తూ ఉన్నా వాడికి ఏమీ అనిపించదు. ఎందుచేతనంటే కర్మసిద్ధాంతానికి వాడు ఓవర్‌కమ్ అయిపోతాడు. దేహమునేను అనే తలంపు పోయింది అనుకోండి వాడికి అనుకూలమైన పరిస్థితులు వచ్చినా, ప్రతికూలమైన పరిస్థితులువచ్చినా వాడికి ఏమీ దెబ్బలు తగలవు. ఎందుచేతనంటే ఆ దెబ్బలు తగిలే నేనుపోయింది. మీరు ఎలా జీవిస్తే నాదయకు పాత్రులవుతారో అలా జీవించగలిగితే మీరు నాహృదయానికి సన్నిహితమవుతారు, ఎప్పుడైతే మీరు నా హృదయానికి దగ్గరయ్యారో మీరు అడుగకుండానే మీకు నా స్వరూపాన్ని ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. మీకు ఇష్టంలేని తలంపు వచ్చినప్పుడు దానిని పరిష్కారం చేసుకోండి అంతేగాని దానిని అణచిపెట్టటానికి ప్రయత్నం చేయకండి. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి అని విచారణ చేసుకొని వాటిని తొలగించుకోండి. అంతేగాని వాటిని లోపల అణిచిపెట్టి ఉంచితే అవి లోపల బలిసిపోయి ఎప్పడో ఒకసారి విజృంభించి మీ మెదడును కలుషితం చేస్తాయి. అనుకరణవద్దు. మనకు భగవంతుడు కేటాయించినపనిని శ్రద్ధగా చేయాలి. శ్రద్ధలేకపోతే సిద్ధి కలుగదు.

మనం మంచిపనులు చేయలేకపోవచ్చు, కనీసం మంచిపనులు చేసేవారిని గౌరవించేశక్తి కూడా మనకిలేదు, వారిని చూసి ఆనందించేశక్తి కూడా మనకులేదు, ఆ స్థాయికి కూడా మనంరాలేదు. లౌకికులతో చాలా ప్రమాదము వారి మాటలో ప్రేమ ఉండదు, భక్తిఉండదు. లౌకికులకు రంపంపెట్టికోసిన వారికి ఆత్మజ్ఞానం కలుగదు. మనం లోకానికి దగ్గరయ్యేకొలది దేవుడికి దూరమవుతాము, దేవుడికి దగ్గరయ్యేకొలది లోకానికి దూరమవుతాము. మన మనస్సులో దేవునికి దగ్గర అవ్వాలని అనుకొంటున్నాము కాని మనం చేసే పనులు అన్నీకూడా లోకానికి దగ్గర అవ్వటానికి చేస్తున్నాము, ఇది అలవాట్లయొక్క వేగము, నీవు ఏదిగా ఉన్నావో నీకు తెలిసినా తెలియకపోయినా నువ్వు ఎప్పడూ అదిగానే ఉన్నావు. కాని నీకు ఆ ఎరుకలేదు. ఈ మధ్య ఒక భక్తురాలు మా ఇంటికి వచ్చారు, ఆవిడ భర్తపోయి సంవత్సరం అవుతోంది. నేను ఆవిడతో మాట్లాడుతూ ఇద్దరూ కలిసి చాలాకాలం జీవించారు, ఆ జ్ఞాపకాలు వచ్చినప్పడు దు:ఖం వస్తూఉంటుంది అన్నాను. మీరు అలా మాట్లాడుతున్నారు ఏమిటండీ, మీ భగవాన్ ఏమని చెప్పారో మర్చిపోయారా? నువ్వు ఏదిగా ఉన్నావో అదిగా ఉంటే నీకు దు:ఖంలేదు అని భగవాన్ చెప్పారుకదా, అలాగే ఉంటున్నాను అన్నారు. మీరు నేనుగా ఉంటే దు:ఖం, తానుగా ఉంటే దు:ఖంలేదు. మీ ఇంద్రియాలతో, మనస్సుతో పనిలేకుండా మీకు అవగాహనయొక్క లోతులు కనుక ఉంటే ఇప్పడే ఇక్కడే జ్ఞానం అనుభవంలోనికి వస్తుంది. మాటలతో, చేతలతో, తలంపులతో పనిలేదు. ఏదో చెయ్యటంవలన ఇదిరాదు, అది ఎలాఉందో నువ్వు అలా ఉండటంవలన లోపలఉన్న వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. స్వప్నంపొట్టిది, జాగ్రదవస్థ కూడా స్వప్నమే కాని ఇదిపొడుగు, పొట్టిపొడుగు తేడాకాని అదెంత అసత్యమో ఇదికూడా అంతే అసత్యం అని భగవాన్ చెప్పారు, కాని ఈ భక్తురాలు ఏమంటున్నారు అంటే కాలంతోటి కొలిచేటప్పడు ఇది పొడుగు, అదిపొట్టి అనిగాని, కాలం గొడవలేనివాడికి పొడుగు, పొట్టిఏమిటి? బహుశాకాలాన్ని కొలిచేవారిని దృష్టిలో పెట్టుకొని భగవాన్ చెప్పిఉంటారు అని అంటున్నారు. భగవాన్ మీద గౌరవంతోటే ఆవిడ మాట్లాడుతున్నారు, మనలను ఇంకా అంచులకు తీసుకొనిపోతున్నారు. బట్టను కత్తిరితో కత్తిరిస్తాము, ఆ కత్తిరికి రెండు అంచులు ఉంటాయి. బట్టను కత్తిరించటానికి కత్తిరియొక్క పైఅంచు, కిందఅంచు రెండుఅంచులూ అవసరమే. అలాగే మన అహంకారము కోతబడటానికి మనకృషీ అవసరమే, భగవంతునికృప కూడా అవసరమే అని రామకృష్ణుడు చెప్పారు. మనం లోకానికి ఇష్టులం అయితే ఓట్లుపడతాయి, భగవంతుడికి యిష్టులుగా ఉంటే మనకు మోక్షం వస్తుంది. మోక్షం మటుకు ఓట్లకి, నోట్లకి దొరకదు, భగవంతుని హృదయానికి మనం యిష్టులం అవ్వాలి, ఆయనకు దగ్గర అవ్వాలి, మనమీద ఆయనకు ప్రీతి కలగాలి అంతే ఆ క్షణంలో మనకు మోక్షం వచ్చేస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 11 టు 14 -03-04 | | శ్రీశైలం క్యాంపు |
| 21-03-04 | ఆది | పాలకొల్లు, వశిష్ట సేవాశ్రమము, ఎవియస్ కాలనీ, హౌసింగ్‌బోర్డు |
| 26-03-04 | శుక్ర | జిన్నూరు శ్రీరమణ క్షేత్రం |
| 30-03-04 | మంగళ | పాలకోడేరు - శ్రీరామనవమి, రామాలయం |

## వాంఛలయొక్క సమూహమే - "జీవితం"

ఈ లోకంతో కూడిన సంబంధమే జీవితం. జీవించటం అంటే మరణించటంకోసం జరుగుతున్న ఒక ప్రక్రియ. గతం నుంచి అనవసరవిషయాలనుంచి మర్చిపోవటమే నిజమైన మరణం. మనం జీవనమరణాలతో సహజీవనం చెయ్యాలి. జీవితంలో క్లిష్టాతిక్లిష్టమైన విషయం " అందుకోవటానికి, సాధించటానికి పడే యాతన " వాంఛలకు ఆలంబనం అహంకారం అదే సంసారం. అహంకారం వేరుతోసహా పెకళిస్తే, గాలిలేనిచోట దీపం ప్రకాశించినట్లు జీవితం సుఖప్రదమౌతుంది. మనలో పాతుకుపోయిన పాతజ్ఞాపకాలు ఈశ్వర వెలుగుతో మనసహస్రారాన్ని చేరి వాటి తాలూకు కర్మలను ప్రోత్సహిస్తాయి. "హృదయస్ఫూర్తి నుంచి జిహ్వమాట్లాడుతుంది" అంటే అదే. "మదించిన ఏనుగు యొక్క కుంభస్థలాన్ని చీల్చుట సులభమేగాని, ఇంద్రియ వాంఛలను నిరోదించటం మాత్రం సులభంకాదు" అంటోంది యోగవాసిష్టము. వాంఛలను తొలగించుకోవాలంటే, ఈ వాంఛలు ఎవరికి అని విచారణచెయ్యటం, లేదా ఈశ్వరుణ్ణి శరణాగతి చెందటం. వాంఛలకెరటాల మీద మనస్సు నిరంతరం నాట్యం చేస్తుంది. అవి అన్నీ పనికిమాలిన ప్రకృతిసంబంధాలే వాటికి అంతుపొంతూ ఉండవు. సంసారం, సంపద, హోదా వర్ణకుల అభిమానాలతో, ముడివడి చిక్కుబడిపోతుంది. ఆ ముళ్ళు సామన్యమైనవి కావు, "బీటముళ్లు" మనం విప్పకోలేము అవి గురుదయతోనే విడివడాలిఅని, శ్రీ నాన్నగారు అంటారు. నూతిలో నీళ్లుతోడుటకు తాడు ఏలా ఆధారంగా ఉందో మానవుడు వాసనలు అనే తాడు ద్వారా పనిజేస్తాడు ప్రపంచంలో అన్నిటికన్నా క్లిష్టమైనపని ఈశ్వరపాదాల యందు మనస్సు నిలపటం అది నీకు సాధ్యమైతే ఆయన అనుగ్రహంతో నీవు తరిస్తావు" అన్నారు. "అంతులేని సంపదతో, అధికారంతో భోగమయమైన జీవితంలో ఉండటం గొప్పకాదు అది ఒక దౌర్భాగ్యపు జీవితం" అంటారు పెద్దలు. కారణం కాలప్రవాహంలో ఆ పుణ్యఫలాలు నశించి దారిద్ర్యజీవితం ప్రారంభంకాక తప్పదు. అందుకే ఒక భక్తుడు ఈశ్వరుణ్ణి యిలా ప్రార్థిస్తాడు. "రాబోయేజన్మ నాకు పందిజన్మఇచ్చినా బాధలేదు నీ పాదాలమీద భక్తి కలిగేలా అనుగ్రహించు" అని. వాంచించదగినది, నమ్మదగినది ఆయన పాదాలమీద భక్తి అదే జీవితానికి నిజమైన సౌభాగ్యము.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

**ది. 29-2-04 ఆదివారం జిన్నూరు శ్రీ రమణక్షేత్రంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి కలిదిండి విజయలక్ష్మీ గారు, వార్డు మెంబర్లు మరియు గ్రామస్తులు ఏర్పాటుచేసిన సభలో 2003 సం॥నకు ఉత్తమ దానశీలి అవార్డు గ్రహీతగా శ్రీ భూపతిరాజు గోపాలకృష్ణంరాజుగారిని సన్మానం చేస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**






# RAMANA BHASKARA
## FORM IV

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | **Palakol** |
| 2. | Periodicity of Publication | : | **Fortnight** |
| 3. | Printer's Name | : | **Shriram Graphics** |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | Bank Street, Palakol |
| 4. | Publisher's Name | : | **P. Sri Rama Raju** |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | Lakshmi Modern Rice Mill<br>Ullamparru, Palakol |
| 5. | Editor's Name | : | **P. Sri Rama Raju** |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | Lakshmi Modern Rice Mill<br>Ullamparru, Palakol |
| 6. | Name and address of Individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital | : | Nil |

I, **P. Sri Rama Raju** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Dated 1-3-2004

Sd/- Publisher